పాచిపెంట మండలం రొడ్డవలస సమీపాన గురువారం ఉదయం 7.45 గంటలకు ఆంధ్రా -ఒడిశా ఘాట్‌రోడ్డులో విశాఖ నుంచి జైపూర్ వెళ్తున్న ఒడిశా ఆర్‌టిసి బస్సు దగ్ధమైంది. ఈ పెను ప్రమాదం నుంచి ప్రయాణికులు సురక్షితంగా బట్టపడ్డారు. సంఘటనా స్థలాన్ని మన్యం ఎస్‌పి మాధవరెడ్డి పరిశీలించారు.

వివరాలు మెయిన్‌లో...

-ప్రజాశక్తి, పార్వతీపురం.

మరణాలపై ప్రశ్నిస్తే.. శవరాజకీయాలంటారా?

- విద్యార్థుల జ్వరాలకు బాధ్యత లేదంటారా?
- మంత్రి సంధ్యారాణిపై జెడ్‌పి సభ్యుల ఆగ్రహం
- ఇప్పటికైనా వసతిగృహాలను పట్టించుకోవాలని హెచ్చరిక
- మెడికల్ కళాశాల ప్రయివేటీకరణపైనా రచ్చ
- పిపిపికి వ్యతిరేకంగా తీర్మానం
- తుపాను నష్ట గణన, అన్నదాత సుఖీభవలో పారదర్శకతకు పట్టు
- వాడీవేడిగా జెడ్‌పి సర్వసభ్య సమావేశం

సమావేశంలో పాల్గొన్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మంత్రులు కొండపల్లి, సంధ్యారాణి, కలెక్టర్లు

'గిరిజన విద్యార్థుల మరణాలపై ప్రశ్నిస్తే శవ రాజకీయాలంటారా? అసలు మంత్రిగా మీకు బాధ్యత ఉందా? లేదా?... జ్వరాలు వస్తే నాకేంటి సంబంధం అన్నట్టుగా మాట్లాడుతున్నారు??... ఎంత వరకు సమంజసం...! జనాలకు సమస్యలు ఉత్పన్నమైతే ప్రజాప్రతినిధులుగా మిమ్మల్ని ప్రశ్నించే హక్కు మాకుంది. ఏ మనుకుంటున్నారో మీరు... ఇప్పటికైనా చిత్తశుద్ధి ఉంటే వసతి గృహాల్లోని విద్యార్థుల సమస్యలను పరిష్కరించండి.... మరణాలను అరికట్టేందుకు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయండి... అంతేగానీ ప్రశ్నించినవారిపైన, మాజీ మంత్రులపై మీ ఇష్టారాజ్యంగా మాట్లాడితే సహించేది' లేదంటూ అంటూ జిల్లా పరిషత్‌లోని మెజార్టీ సభ్యులు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి/కంటోన్మెంట్

చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థుల మరణాలు, మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణ, అన్నదాత సుఖీభవ అందరికీ అందకపోవడం, తుపాను నష్టగణన పూర్తిస్థాయిలో చేయకపోవడం తదితరాలపై వాడీవేడిగా చర్చనడిచింది. వైద్యారోగ్య శాఖపై చర్చ నడుస్తుండగా 'గిరిజన విద్యార్థుల మరణాలకు ఎవరు బాధ్యత వహిస్తారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా జిల్లాలో ఉండి కూడా ఒకింత నిర్లక్ష్యంగా వ్యవహరించడం, బాధ్యతారాహిత్యంగా మాట్లాడడం సరికాదంటూ పెద్దపెట్టున నిలదీశారు. దీనిపై మంత్రి బుకాయించేందుకు ప్రయత్నించడంతో మన్యం జిల్లా పరిధిలోని జెడ్‌పి సభ్యులంతా పెద్దపెట్టున కేకలు వేస్తూ మంత్రిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో, విద్యార్థుల మరణాలు బాధకారమంటూ స్వరం మార్చారు. కురుపాంలో ఇద్దరి విద్యార్థుల మరణం తరువాత 'నా సొంత నియోజకవర్గం సాలూరులో కూడా ఇద్దరు విద్యార్థులు చనిపోయిన మాట వాస్తవమేనని, ఇకపై ఇలాంటి పరిణామాలు చోటుచేసుకోకుండా చూడాలని కలెక్టర్‌కు ఆదేశాలిచ్చానని చెప్పారు. ఈ అంశంపై సుమారు 45నిమిషాలపాటు సమావేశంలో చర్చ నడిచింది. మరోవైపు మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణపైనా సమావేశం తీవ్రంగా వ్యతిరేకించింది. పిపిపి పద్ధతిలో మెడికల్ కళాశాలలు నిర్వహించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల పేదలకు తగిన వైద్యం అందే పరిస్థితి ఉండబోదని, పేద విద్యార్థులకు కూడా వైద్య విద్య అందుబాటులో ఉండే పరిస్థితి లేదని ఎమ్మెల్సీ సురేష్ బాబు సహా వైసిపికి చెందిన పలువురు సభ్యులు లేవనెత్తారు. పిపిపి అంటే ప్రైవేటు కాదంటూ జిల్లాకు చెందిన కొండపల్లి శ్రీనివాస్ సహా విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు, డిసిఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ సహా పలువురు వాదించడంతో జెడ్‌పి సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. చివరకు మెడికల్ కాలేజీని ప్రభుత్వ రంగంలోనే నడపాలంటూ విజయనగరం ఎంపిపి మామిడి అప్పలనాయుడు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని జెడ్‌పి సభ్యులంతా ఆమోదించారు.

దీనికి ముందు ధాన్యం సేకరణపై జరిగిన చర్చలో భాగంగా జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు మాట్లాడుతూ 35 శాతం కన్నా ఎక్కువ పంట నష్టం జరిగితేనే నమోదు చేస్తున్నారని, అంత కన్నా తక్కువ జరిగిన వారి పరిస్థితేంటని ప్రశ్నించారు. ఇప్పటికీ పంట కొంత మేరకు నీటిలో మునిగి ఉందని, ధాన్యం రంగు మారే అవకాశం ఉందని, వాటిని ఏ విధంగా కొనుగోలు చేస్తారో రైతులకు వివరించాలని కోరారు. 30 శాతం లోపల నష్టం జరిగిన వారి వివరాలను కూడా నమోదు చేసి ప్రభుత్వం దష్టి లో పెట్టాలని, వారికి నష్ట పరిహారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పంట నష్టాలను నమోదు చేసేటప్పుడు భౌతికంగా పంట ను తనిఖీ చేసి నమోదు చేయాలని, ఎవరో చెప్పారని నమోదు చేయకూడదని తెలిపారు. వీలైతే పంట నష్ట నష్టాలను నమోదు తేదీలను పొడిగించాలని కోరారు. అలాగే గోనె సంచులు ప్రభుత్వం సరఫరా చేస్తుందా లేక రైతులే సమకుర్చుకోవాలా స్పష్టంగా చెప్పాలన్నారు. జే.సి సేదు మాధవన్ స్పందిస్తూ జిల్లాకు కోటి గోనె సంచులు అవసరం అవుతాయని, ప్రస్తుతం జిల్లా స్థాయి లో 50లక్షల వరకు సర్దుబాటు అవుతున్నాయని, మిగిలిన వాటి కోసం ప్రభుత్వం స్థాయి లో చర్చ జరుగుతోందని తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ విప్ (కురుపాం ఎమ్మెల్యే) తోయక జగదీశ్వరి, విజయనగరం, మన్యం జిల్లాల కలెక్టర్లు ఎస్. రాంసుందర్ రెడ్డి, డాక్టర్ ఎన్ .ప్రభాకర్ రెడ్డి, విజయనగరం జాయింట్ సేదు మాధవన్, పార్వతీపురం సబ్-కలెక్టర్ డాక్టర్ ఆర్.వైశాలి, జెడ్‌పి సిఇఒ సత్యనారాయణ, ఎస్.కోట, నెల్లిమర్ల ఎమ్మెల్యేలు కోళ్ళ లలిత కుమారి, లోకం నాగమాధవి, కాపు కార్పొరేషన్ ఛైర్పర్సన్ పాలవలస యశస్వి, రెండు జిల్లాలకు చెందిన అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వలేం

మంత్రి సంధ్యారాణి

ఇటీవల మృతిచెందిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఎలాంటి నష్టపరి హారమూ ఇవ్వలేమని, ఇచ్చేందుకు కూడా అవకాశం లేదని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తేల్చిచెప్పారు. సీతంపేటలో మృతిచెందిన బాలిక కుటుంబీకులకు రూ.2లక్షలు ప్రకటించినట్టే కురుపాంలో కూడా చెల్లించాలని జెడ్‌పి సభ్యులు కోరగా పై విధంగా మంత్రి స్పందించారు. ఇటువంటి పాలసీ తమ ప్రభుత్వంలో లేదని, గత ప్రభుత్వంలో కూడా ఇలా మృతిచెందిన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున పరిహారం చెల్లించలేదని అన్నారు. తన నియోజకవర్గంలో ఇటీవల మరణించిన ఇద్దరు విద్యార్థులకు కుటుంబీకులకు కూడా ప్రభుత్వం తరపున ఎలాంటి సాయం అందించే ప్రసక్తి లేదన్నారు.

సమావేశంలో పాల్గొన్న సభ్యులు

పిపిపి పద్ధతిలోనే మెడికల్ కాలేజీ

మంత్రి కొండపల్లి

పిపిపి పద్ధతిలో మెడికల్ కాలేజీ నిర్వహణ సాగుతుందని జిల్లాకు చెందిన రాష్ట్ర ఎంఎస్ఎంఇ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. అది తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. మెడికల్ కాలేజీ ప్రైవేటీకర ణపై జెడ్‌పిలో పెద్దఎత్తున చర్చ జరిగింది. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పేదలకు ఎటువంటి అన్యాయం జరగబోదని, నాణ్యమైన వైద్య అందుతుందని అన్నారు. యూరియా ఎక్కువగా వినియోగించడం వలన కాన్సర్ వంటి వ్యాధులు వస్తున్నాయని, ఈ విషయంలో రైతులకు అవగాహన కలిగించాల్సిన అవసరం ఉందన్నారు. 'కొత్త పించన్లు ఎప్పుడు ఇస్తారంటూ పలువురి సభ్యుల ప్రశ్నకు ఆయన స్పందిస్తూ దరఖాస్తులను స్వీకరిస్తున్నామని, త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

మరోసారి వికలాంగులకు నోటీసులు

- వైకల్యం పునఃపరిశీలన కోసం 1863 మందికి జారీ
- పింఛన్ల కోతపై లబ్దిదారుల్లో ఆందోళన

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో మరోసారి వికలాంగులకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. గతంలో వైద్యుల పరిశీలనలో అనర్హతకు దగ్గరలో ఉన్న వికలాంగులకు ఇప్పుడు మళ్లీ పునఃపరిశీలన చేయించుకోవాలని నిర్దేశించింది. ఇప్పటికే జిల్లాలో 1863మంది వికలాంగుల పింఛను తీసుకుంటున్న లబ్దిదారులకు నోటీసులు అందాయి. ఈ మేరకు జిల్లాలో ఉన్న ప్రభుత్వాసుపత్రులకు వారిని కేటాయించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సహకారంతో స్థానిక ఎంపిడిఒలు నోటీసులు జారీ చేశారు. 1197మంది శారీరక వికలాంగులు, 304మంది దృష్టి లోపం ఉన్న వారు, 308 చెవిటి, మూగవారు, 51మంది మానసిక వికలాంగులు, ముగ్గురు మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వారికి నోటీసులు జారీ చేశారు. వీరిలో పాలకొండ ఏరియా ఆసుపత్రికి 555, సాలూరు ఏరియా ఆసుపత్రికి 322, సీతంపేట ఏరియా ఆసుపత్రికి 278, పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రికి 301, విజయనగరం సార్వజనీన ఆసుపత్రికి 407మందిని కేటాయించారు. ఈ నెలాఖరులోగా వీరి వైకల్యం పునఃపరిశీలన ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారి నిర్వహించిన వైకల్యం పరిశీలనలో వీరంతా దాదాపు పింఛను పొందడానికి అనర్హులు గానే ప్రభుత్వం భావిస్తోంది. మొదటి పరిశీలన ప్రక్రియలో వడపోసిన వీరంతా 40 శాతం వైకల్యం వున్నవారే. వీరందరికీ పింఛను తొలగిస్తారనే ఊహాగానాలు వెలువడడంతో లబ్దిదారుల్లో ఆందోళన మొదలైంది. దీంతో వారికి పింఛన్లు తొలగించకుండా కొనసాగించింది. రూ.6వేలు పింఛను తీసుకుంటున్న వీరిలో ఎక్కువ మందిపై కోత పడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. దీంతో నోటీసులు అందుకున్న లబ్దిదారుల్లో ఆందోళన తీవ్రతరమవుతోంది.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారి కార్యాలయం, సీతానగరం మండలం
పార్వతీపురం మన్యం జిల్లా
నోటీసు

తేది : 14/10/2025

యన్.టి.ఆర్ భరోసా పింఛను పథకము
పింఛను ఐడి : 10200016290
సచివాలయం ఐ డి : 10290520
సచివాలయం పేరు : లచ్చిపురమ్

విషయము : యన్.టి.ఆర్ భరోసా పింఛను పథకము, వికలాంగుల పింఛను పునఃపరిశీలన – గురించి.

సూచిక : Memo.No. 2474995 /RD. I/A3/2025, PR&RD Dept. Dated : 03-01-2025

****

పై సూచిక ప్రకారం మీ వైకల్యమును పునఃపరిశీలన చేయించుకోవటానికి క్రిందతెలిపిన ఆసుపత్రిలో మీ సదరం సర్టిఫికేట్ మరియు ఆధార్ కార్డు తో పాటుగా హాజరు కావాల్సిందిగా కోరడమైనది

పునఃపరిశీలన కొరకు హాజరు కావలసిన ఆసుపత్రి పేరు	పునఃపరిశీలన కొరకు హాజరు కావలసిన తేది: మరియు సమయము
Area Hospital, Salur A.Locomotor/OH	07/11/2025 09:00 AM NOTICE - APPEAL

మీరు పైన తెలిపిన తేదిన, పైన తెలిపిన ఆసుపత్రిలో పునఃపరిశీలన కు హాజరు కానీ యెడల మీ వికలాంగుల పింఛను నిలుపుదల చేయబడునని తెలియచేటమైనది .

మండల పరిషత్ అభివృద్ధి అధికారి
సీతానగరం మండలం

శ్రీ/శ్రీమతి/కుమారి : KOLA SURAMMA
సచివాలయం ఐ డి : 10290520
సచివాలయం పేరు : లచ్చిపురమ్
మండలం:సీతానగరం మండలం
జిల్లా :పార్వతీపురం మన్యం

పింఛనుదారులకు అధికారులు జారీ చేసిన నోటీసు

ఐటిడిఎలో ప్రతీ శుక్రవారం 'గిరిజన గ్రీవెన్స్ డే'

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజనులకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారంపై ఏజెన్సీ స్థాయిలో ప్రత్యేక దృష్టి సారించాల్సిన ఆవశ్యకతను గుర్తించిన ప్రభుత్వం, ఈ దిశగా కీలక నిర్ణయం తీసుకుందని కలెక్టర్ డా. ఎన్ ప్రభాకర రెడ్డి అన్నారు. గిరిజనుల సమస్యలను వేగంగా, సమర్థవంతంగా పరిష్కరించడానికి ప్రతి శుక్రవారం పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎల్లో ప్రత్యేకంగా 'గిరిజన గ్రీవెన్స్ డే' నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ గ్రీవెన్స్‌డేకు గిరిజన సంక్షేమం, రెవెన్యూ, గృహనిర్మాణం, విద్య, ఆరోగ్యం, ఇతర సంక్షేమ కార్యక్రమాలతో వ్యవహరించే సంబంధిత లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు విధిగా హాజరు కావాలన్నారు. అర్జీదారుల నుంచి స్వీకరించిన అన్ని ఫిర్యాదులపై కాలపరిమితిలోపు తదుపరి చర్యలు చేపట్టాలని, పరిష్కారాన్ని నిర్ధారించాన్నారు.

కబడ్డీ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ సూచించారు. జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమంలో భాగంగా క్లస్టర్ స్థాయి క్రీడా పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. ఐటిడిఎ పరిధిలోని మూడు క్లస్టర్ల స్థాయిలో ఈ క్రీడా పోటీలను నిర్వహించారు. గురువారం సీతంపేట క్లస్టర్ స్థాయి పోటీల ప్రారంభానికి హాజరైన పిఒ క్రీడాకారుల ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడల వల్ల శారీరక ఉల్లాసం, మానసిక ఉత్తేజం కలుగుతుందని అన్నారు. ఆటలు ఆడడం వల్ల మెదడు మరింత చురుగ్గా పనిచేస్తుందన్నారు. క్లస్టర్, ఐటిడిఎ స్థాయిలో గెలుపొంది, రాష్ట్రస్థాయిలో కూడా ఉన్నతంగా రాణించాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో డిడి అన్నదొర, సూపరింటెండెంట్ అప్పారావు, స్పోర్ట్స్ ఇన్చార్జి జాకబ్, ఇతర పీడీలు, పిటిలు, తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ పనులను వేగవంతం చేయాలి

ఐటిడిఎ ద్వారా చేపడుతున్న ఇంజినీరింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ పనుల్లో నాణ్యత లోపించకూడదన్నారు. అదే విధంగా పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. పూర్తయిన పనులకు బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మల్టీ పర్పస్ సెంటర్ భవనాలను పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో ఇఇ రమాదేవి, పిఆర్ డిఇ లోకనాథం, ఇతర డిఇలు నాగభూషణం, ఎఇలు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సమస్యల తిష్ట

అరకొరగా మరుగుదొడ్లు

ప్రజాశక్తి - సీతానగరం

ప్రభుత్వ గురుకుల గిరిజన, బిసి సంక్షేమ వసతి గృహాల్లో కనీస వసతులు కరువవ్వడంతో విద్యార్థులు సమస్యల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, బాత్‌రూములు, డార్మెట్లు లేవు. మరుగుదొడ్లకు తలుపుల్లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా ప్రభుత్వం సక్రమంగా నిధులివ్వకపోవడంతో మెనూ కూడా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. దీంతో విద్యార్థులకు పౌష్టికాహారం అందని ద్రాక్షలా మారింది.

మండలంలోని జోగింపేటలో గల కస్తూరిబాయి బాలిక వసతి గృహం, అంబేద్కర్ గురుకుల పాఠశాల, ప్రతిభ పాఠశాల, మరిపివలసలోని బాలికల వసతి గృహం, గాదిలివలసలోని బాలికల వసతి గృహం, బూర్జలోని బిసి బాలుర సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. ఈ గురుకుల పాఠశాలలన్నింటి లోనూ అరకొర వసతులు ఉన్నాయి. దీంతో విద్యార్థులు నిత్యం ఇబ్బందులు పడుతూ చదువు సాగిస్తున్నారు. విద్యార్థులకు సరిపడా వసతి గృహాల్లేకపోవడంతో శిథిలావస్థలో ఉన్న భవనాల శ్లాబులు పెచ్చులూడిపోవడంతో ఎప్పుడు ఎవరిపైన అవి పడతాయేమోనని బిక్కుబిక్కు మంటూ విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నారు. బూర్జ బిసి బాలుర వసతిగృహంలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈహాస్టల్‌లో 40మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో గల మరుగుదొడ్లకు పూర్తిగా తలుపులు లేవు. బాత్‌రూముల్లో రన్నింగ్ వాటర్ లేక ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వాటర్ ప్లాంట్ మరమ్మతులు చేయడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంలేదు. ఆఖరుకు వసతిగృహానికి విద్యార్థులు వెళ్లేందుకు రహదారి కూడా సక్రమంగా లేదు. దీంతో వారు విష సర్పాల కాటుకు గురయ్యే ప్రమాదం కూడా ఉంది. విద్యార్థులు వెళ్లే రహదారిలో గడ్డి, పిచ్చి మొక్కలతో కూడుకొని ఉంది. అలాగే తాగునీరు కూడా లేదు. హాస్టల్ గేటు వద్ద మురుగు నీరు నిల్వ ఉండడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో విద్యార్థులు అనారోగ్యం బారినపడే పరిస్థితి కూడా ఏర్పడుతుంది.

బూర్జ హాస్టల్‌కు వెళ్లే దారిలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు

అధ్వాన్నంగా ఉన్న మరుగుదొడ్డి

జోగింపేట గురుకుల పాఠశాలలో 300మందికి పైగా విద్యార్థులు ఉన్నప్పటికీ వాటర్ ప్లాంట్, ఆర్వో వాటర్ ప్లాంట్ మరమ్మతులు గురికావడంతో బాగు చేసేందుకు నిధులు లేవు. అలాగే బాత్‌రూములు కూడా శుభ్రంగా లేకపోవడంతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. ఎక్సలెన్సీ ప్రతిభా పాఠశాలలో 200మందికి పైగా విద్యార్థులు ఉన్నప్పటికీ కనీస సౌకర్యాలు ప్రభుత్వం కల్పించడం లేదు. విద్య కోసం నిధులు కేటాయిస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఆచరణలో అమలు చేయడం లేదు. మండలంలోని అన్ని వసతి గృహాల్లోనూ ఇదే పరిస్థితి. వసతిగృహాల్లో కనీస సౌకర్యాల కోసం గత ఐదేళ్లగా నిధులు ప్రభుత్వం ఇవ్వకపోవడంతో ఆయా వసతి గృహాల ప్రిన్సిపాళ్లు, వార్డెన్లు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది హెచ్ఎంలు, వార్డెన్లు అప్పులు చేసి వసతి గృహాల విద్యార్థులకు భోజనాలు పెడుతున్నారు. అయినా ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ అధికార యంత్రాంగం దృష్టిసారించి సమస్యలు పరిష్కరించే దిశగా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చిరుధాన్యాల సాగు మరింత పెరగాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక వ్యవసాయ యంత్ర పనిముట్లను అందిపుచ్చుకొని సాగు చేసే దిశగా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి వ్యవసాయ శాఖాధికారులను ఆదేశించారు. జిల్లాలోని ప్రతి రైతు ఒక వ్యాపారవేత్తగా ఎదగాలని, అందుకు అవసరమైన సలహాలు, సూచనలు చేయడంతో పాటు తగిన శిక్షణ ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం ఆరువేల ఎకరాల లక్ష్యంగా ఉన్న చిరుధాన్యాల సాగు మరింత పెరగాలని, లాభసాటి పంటలను వేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. గురువారం జిల్లా ప్రగతి సమీక్షలో భాగంగా వ్యవసాయ, పౌర సరఫరాలు, డ్వామా, డిఆర్‌డిఎ, మెప్మా, ఐసిడిఎస్, గిరిజన సంక్షేమం, సాంఘిక సంక్షేమ తదితర శాఖాధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన ఖాళీ ప్రభుత్వ భూముల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలను వేసి ఆదాయం వచ్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో 8 వరకు వినియోగంలో ఉన్న డ్రోన్ల సంఖ్యను మరింత పెంచే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యం, పత్తి కొనుగోళ్ల కేంద్రాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని, మొంథా తుఫానులో నష్టపోయిన పంటల వివరాలను త్వరగా ప్రభుత్వానికి సమర్పించాలని అన్నారు. జిల్లాలో 2,73,000 స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో వలస వెళ్లిన వారి వివరాలు సేకరించి త్వరగా బట్వాడా చేసేలా కృషి చేయాలని డిఎస్ఒను కలెక్టర్ ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో డోలీమోతలు లేకుండా అంబులెన్సు వెళ్లేలా గుర్తించిన 83 పనులు కూడా టెండర్ ప్రక్రియ పూర్తిచేసి, పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అన్ని చెరువులు కూడా శతశాతం నీటితో నిండాలని, జలపాతాల వద్ద చెక్ డ్యామ్స్ వీలైనంత త్వరగా పూర్తిచేయాలని అన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేపట్టాలని, అలాగే ప్రతి విద్యార్థికి హెల్త్ రికార్డులను నిర్వహించాలని సూచించారు. ముస్తాబు కార్యక్రమం పక్కాగా నిర్వహించాలని, విద్యార్థులతో యోగా, క్రీడలు వంటివి చేయించాలని అన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు పటిష్ట చర్యలు చేపట్టాలని, అంగన్వాడీ, పాఠశాల లు, కళాశాలల్లో మౌలిక వసతులు ఉండాలని స్పష్టం చేశారు. సమావేశంలో వ్యవసాయ శాఖాధికారి కె.రాబర్ట్ పాల్, డ్వామా, డిఆర్‌డిఎ, ఐసిడిఎస్ పీడీలు కె.రామచంద్రరావు, ఎం.సుధారాణి, టి.కనకదుర్గ, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య సేవలపై సిఆర్ఎం బృందం పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో నేత్ర వైద్య సేవలు ప్రజలకు అందుతున్న తీరుపై కేంద్ర వైద్య బృంద సభ్యులు (సిఆర్ఎం టీమ్) జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా ఆసుపత్రిలో ఉన్న జిల్లా అంధత్వ నివారణ సంస్థ కార్యాలయాన్ని పరిశీలించారు. కామన్ రివ్యూ మిషన్‌లో భాగంగా డాక్టర్ భవానీ సింగ్, అంకుర్ శర్మతో కూడిన బృంద సభ్యులు గురువారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరిశీలనలు చేపట్టి జిల్లాలో ఆరోగ్య పరిస్థితులు, నేత్ర వైద్య సదుపాయాలపై సమీక్షించారు. అనంతరం క్షేత్ర స్థాయిలో వైద్య సేవలు పరిశీలనలో భాగంగా జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఏ రీతిలో నేత్ర వైద్య సేవలందిస్తున్నారు, శస్త్ర చికిత్సలు, కళ్లజోళ్లు ఏ మేరకు చేరువవుతున్నాయో రాష్ట్ర బృందం సభ్యులతో కలిసి పరిశీలించారు. నేత్ర వైద్య అదికారులతో సమీక్షించి ఆరోగ్య కార్యక్రమాలపై ఉన్న పరిజ్ఞానాన్ని, పని తీరును తెలుసుకున్నారు. ఆసుపత్రి నేత్ర వైద్య విభాగాలను, ఆవరణలను పరిశీలించారు. వైద్య పరికరాల పనితీరు పరిశీలించాక ఐఇసి గోడ పత్రికల ప్రదర్శన తిలకించారు. అనంతరం నేత్ర రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. జిల్లా ఆసుపత్రిలో అవసరమైన పరికరాల నివేదికలను ప్రభుత్వానికి సమర్పిస్తున్నట్టు తెలిపారు. పరిశీలనలో భాగంగా టీమ్ హెడ్ డాక్టర్ భవానీసింగ్ నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైద్య శాఖ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వినోద్ కుమార్, నేత్ర శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ వెంకటేష్, నేత్ర వైద్యాధికారులు జీరు నగేష్ రెడ్డి, కృష్ణారావు, నేత్ర వైద్య సహాయకులు రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నేత్ర వైద్యాధికారులతో మాట్లాడుతున్న సిఆర్ఎం బృందం సభ్యులు

ఎస్‌పిని కలిసిన ఎఎస్‌పి మనీషా

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా పార్వతీపురం సబ్ డివిజన్ నూతన ఎఎస్‌పి (ఎస్‌డిపిఒ)గా మనీషా వంగల రెడ్డి గురువారం పార్వతీపురం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లా ఎస్‌పి ఎస్‌వి మాధవ్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి, పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాధవ్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. పార్వతీపురం సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరి రక్షణకు తీసుకో వాల్సిన చర్యలు, నిర్వహించాల్సిన విధులు, బాధ్యతల పట్ల దిశా నిర్దేశం చేశారు.

ఎస్‌పిని కలిసి పూల మొక్కను అందజేస్తున్నఎఎస్‌పి మనీషా

ఓటర్ల ప్రక్షాళన జాబితాపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఓటర్ల ప్రక్షాళన జాబితా రూప కల్పనపై జిల్లా ఎన్నికల అధికారులు దృష్టి సారించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ తెలిపారు. ఓటర్ల ప్రక్షాళన జాబితా తయారీపై జిల్లా కలెక్టర్లతో ఆయన శిక్షణా కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఓటర్ల జాబితా రూపకల్పనకు బిఎల్ఒలు సర్వే చేయాలన్నారు. 2002 సంవత్సరం నాటి ఓటర్లు, 2025 ఓటర్ల జాబితాతో పోల్చి విచారణ చేపట్టాలని, ఇంటింటా ఓటర్ల సర్వే విచారణ జరపాలని కోరారు. 2002లో ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్నవారు ఆధారాలు చూపించాల్సిన అవసరం లేదని, 1987 నుంచి 2004 వరకు ఓటర్ల జాబితాలో ఉన్న ఓటర్లను తండ్రి పేరుతో అనుసంధానించాలని స్పష్టం చేశారు. బిఎల్ఒ లు ఇంటింటా సర్వే చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్ల ధ్రువీకరణ పత్రాల పరిశీలన తప్పనిసరిగా చేపట్టేలా అధికారులు శిక్షణ ఇవ్వాలన్నారు. సమావేశంలో కలెక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణను నిరోధించండి : సిపిఎం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ నడిబొడ్డున వరహాల గెడ్డ పోరంబోకు ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు తప్పుడు సర్వే నెంబర్లు నమోదు చేసి రిజిస్ట్రేషన్ జరిపి, ఆక్రమణకు గురి చేశారని వెంటనే దానిని అరికట్టాలని సిపిఎం పట్టణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గల మున్సిపల్ మేనేజర్ గోర లక్ష్మికి సిపిఎం నాయకులు, మహిళలు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ పట్టణంలో సర్వే నెంబరు 410కి చెందిన వరహాల గెడ్డ పోరంబోకు ప్రభుత్వ భూమిని 411 సర్వే నెంబరుగా నమోదు చేసి 1200 గజాల స్థలాన్ని విశాఖకు చెందిన వ్యాపారస్తులకు అమ్మకాలు చేశారన్నారు. ఈ భూమిని గతంలో ప్రభుత్వ భూమిగా రెవెన్యూ అధికారులు గుర్తించి బోర్డులను, సరిహద్దు రాళ్లను పెట్టారని, అప్పుడు ప్రభుత్వ భూమిగా గుర్తింపు పొందిన భూమి ఇప్పుడు ప్రైవేటు భూమిగా ఎలా మారిందో తెలపాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ నిబంధనల ప్రకారం గెడ్డ పోరంబోకు, చెరువుల్లో భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు లేనప్పటికీ మున్సిపల్ యంత్రాంగం భవన నిర్మాణాలకు అనుమతి ఇవ్వడంతో ఇలాంటి అక్రమాలు పెరుగుతున్నాయని అన్నారు. కావున వరహాలగెడ్డ ఆక్రమిత స్థలంతో పాటు ప్రభుత్వ స్థలాలు, చెరువులు తదితర స్థలాల్లో భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయకుండా నిరోధించాలని, అక్రమ భవన నిర్మాణాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు పాకల సన్యాసిరావు, బి.సూరిబాబు, ఎస్.ఉమా, పి.రాజశేఖర్, మహిళలు తదితరులు పాల్గొన్నారు..

మున్సిపల్ మేనేజర్‌కు వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు

మండల పరిషత్ నిధులపై ఆడిట్

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ నిధులకు సంబంధించి మన్యం జిల్లా అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ మురళీకృష్ణ ఆధ్వర్యాన గురువారం నిర్వహించారు. 2024 ఏప్రిల్ ఒకటో తేదీ నుండి 2025 మార్చి 31 వరకు జమా, ఖర్చులు, మిగులు వంటివి సంబంధించి ఆడిట్ నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఆయనతో పాటు శంకర్రావు, శ్రీనివాసరావు ఉన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ అవినాష్

కె.వెంకటాపురంలో పొలంబడి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కె.వెంకటాపురంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖాధికారి ఎస్ అవినాష్ మాట్లాడుతూ సేంద్రియ ఎరువుతో అధిక దిగుబడులు వస్తున్నాయని, కావున గ్రామంలో 13 మంది రైతులు సేంద్రియ ఎరువులతో వ్యవసాయం చేస్తున్నారని అన్నారు. ఇందులో ఎన్ఎల్ఆర్ 64 ఆర్‌జిఎల్, 2537 రకాల నుంచి ఒక్కొక్కటి మూడు కేజీల నమూనాను పరీక్ష కోసం గుంటూరు పంపనున్నట్టు తెలిపారు. తద్వారా ఇక్కడ ఆదాయాన్ని పెంచుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటర్ శ్రీహరి, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సంతకాల సేకరణలో కురుపాం ముందంజ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఓట్ చోర్ గద్దీ ఛోడ్ అంటూ సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 15 వరకు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన సంతకాల సేకరణ ఉద్యమంలో కురుపాం నియోజకవర్గం ముందంజలో ఉండటంతో కాంగ్రెస్ పెద్దలు స్థానిక నాయకులను అభినందించారు. అధిష్టానం ఆదేశించిన రీతిగా అధిక మొత్తంలో సంతకాల సేకరణ నిర్వహించి అరకు పార్లమెంట్ పరిధిలోగల అసెంబ్లీ నియోజకవర్గాలన్నింటికంటే మిన్నగా చేపట్టి కాంగ్రెస్ కమిటీ పెద్దల చేత శభాష్ అనిపించుకున్నారు. ఈ మేరకు విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల రెడ్డి తమను అభినందించారని నియోజకవర్గ కో ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్

మున్సిపాల్టీ పరిధిలో గల రెండో వార్డు కొత్తవీధిలోని తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం నాయకులు గొర్లి వెంకటరమణ, సంచాన ఉమామహేశ్వరరావు ఆ వీధి మహిళలతో కలిసి గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గల మున్సిపల్ ఎఇ అప్పారావుకు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ వీధిలో ఐదు రోజులకు ఒకసారి కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా జరుగుతుందని, దసరా మామూళ్లు ఇవ్వలేదని పబ్లిక్ కుళాయిని సిబ్బంది డమ్మీ చేశారని, వీధిలో ఉన్న మున్సిపల్ బోర్లు అన్నీ మరమ్మతులకు గురయ్యాయని, దీంతో తాగునీటికి కటకటలాడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించాలని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని కడకల్లా బొడ్లపాడు ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు స్థానిక ఎఇ కే.సోమేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణ, చెట్లు తొలగింపు తదితర కార్యక్రమాల వల్ల వీటి పరిధిలో ఉన్న కడకల్లా, విక్రంపురం, నడిమికెళ్ల, కంబర, వండువా, బిటివాడ, ఎంవిపురం, బొడ్లపాడు, పాపంపేట, జెబిఎం వలస, ఆడారు తదితర గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మున్సిపల్ కమిషనర్‌గా కిశోర్‌కుమార్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ ఉత్తర్వులు మేరకు పార్వతీపురం మున్సిపల్ కమిషనర్‌గా కె.కిషోర్ కుమార్ పదోన్నతిపై రానున్నట్లు జిఒ కాపీ గురువారం కార్యాలయానికి వచ్చింది. ఈయన ప్రస్తుతం విశాఖ నగరపాలక సంస్థలో శానిటరీ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. త్వరలో మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తారు.

బాధిత కుటుంబానికి చెక్కును అందిస్తున్న అసోసియేషన్ నాయకులు

డెత్ రిలీఫ్ ఫండ్ అందజేత

ప్రజాశక్తి- సీతంపేట

మెలియపుట్టి పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న ఎఎస్ఐ బగాది అప్పన అక్టోబరు 30న అనారోగ్యం కారణంగా మరణించిన విషయం తెలిసిందే. ఆయన ఆకస్మిక మృతిపట్ల జిల్లా పోలీసు అసోసియేషన్ సంతాపం వ్యక్తం చేసింది. జిల్లా పోలీసు అసోసియేషన్ కార్యవర్గ అధ్యక్షుడు ఆర్ కృష్ణంనాయుడు, ట్రెజరర్ భుజంగరావు గురువారం అప్పన స్వగ్రామం ఎచ్చెర్లలోని పోలీసు క్వార్టర్ సమీపంలో గల నివాసానికి వెళ్లి ఎఎస్ఐ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం డెత్ రిలీఫ్ ఫండ్ నుంచి కేటాయించిన లక్ష రూపాయలు నగదు చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆమదాలవలస పోలీసు స్టేషన్‌లో పని చేస్తూ ఇటీవల మరణించిన ఎస్ఐ ఆరిక సింహాచలం గత నెల 31వ తేదీన అనారోగ్యంతో బాధపడుతూ ఆకస్మికంగా మరణించారు. ఆయన స్వగ్రామమైన సీతంపేట మండలం దేవనాపురం గ్రామానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులకు డెత్ రిలీఫ్ ఫండ్ రూ.లక్ష చెక్కును అందజేశారు.

పోటీలను ప్రారంభిస్తున్న ఎంపిడిఒ

ఆశ్రమ పాఠశాలల ఆటల పోటీలు

ప్రజాశక్తి- మక్కువ

మండలంలోని ఎర్ర సామంత వలస ఆశ్రమ పాఠశాలలో అంతర ఆశ్రమ పాఠశాలల మధ్య ఆటల పోటీలు గురువారం నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో జరిగే ఈ పోటీల్లో తొమ్మిది ఆశ్రమ పాఠశాలలకు చెందిన 200 మంది విద్యార్థులు పాల్గొని తలబడ్డారు. స్థానిక ఎంపిడిఒ అర్జునరావు టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. వాలీబాల్, కబడ్డీ, వక్తృత్వ, జావిలెన్‌త్రో, వ్యాసరచన, డ్రాయింగ్, ఆర్చరి వంటి పోటీలను నిర్వహించి విజేతలుగా నిలిచిన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని కోఆర్డినేటర్ ఎం.వాసుదేవరావు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు, పీడీ జీవీ ప్రసాద్, వార్డెన్ ఎం. పోలినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జన జాతీయ గౌరవ దివస్ సందర్భంగా ఎటిడబ్ల్యుఒ స్థాయిలో పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌లో మండలంలోని టిక్కబాయి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మొదటి స్థానం లభించింది. ఈ మేరకు ఆయా పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పోటీలకు ముఖ్యఅతిథిగా ఎటిడబ్ల్యుఒ ఎల్.రజిని హాజరై విద్యార్థులుదేశించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను, ఆటల పోటీల్లో కూడా చురుగ్గా పాల్గొని ఆదరాభిమానాలను చూరగొనేలా ఉండాలన్నారు. అన్ని రంగాల్లో చురుగ్గా ఉంటేనే భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగవచ్చని అన్నారు. అనంతరం మొదటి స్థానం పొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం ఆమె పాఠశాల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు వారి స్థాయిలను బట్టి అర్థమయ్యేలా విద్య బోధన చేయబడితే పరీక్షల్లో మంచి మార్కులు సంపాదిస్తారని అన్నారు. విద్యార్థుల స్థాయిలను బట్టి బోధించాలన్నారు. అందరికీ ఒకేలా బోధన చేపడితే వెనుకబడిన విద్యార్థులకు పాఠ్యాంశాలు అర్థం కావని, ఈ మేరకు అలాంటి వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా విద్యా బోధన చేపట్టాలని కోరారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు వండి పెడుతున్న ఆహార పదార్థాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ జ్ఞాన ప్రకాష్, కొత్తగూడా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు, పలు పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాలూరు: జన జాతీయ గౌరవ దివస్' వేడుకలలో భాగంగా గురువారం మండలంలో కొత్తవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఆవరణలో విద్యార్థినులకు క్రీడలు, సాంస్కృతిక పోటీలను ఎటిడబ్ల్యుఒ, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎటిడబ్ల్యుఒ రామలక్ష్మి మాట్లాడుతూ గిరిజన పోరాటయోధుడు భగవాన్ బిర్సాముండా జయంతిని పురస్కరించుకొని బాలికలకు వాలీబాల్, కబడ్డీ, పరుగుపందెం వంటి క్రీడాపోటీలు నిర్వహించామన్నారు. విద్యార్థినిలలో ఉండే సృజనాత్మకత, మేధస్సును వెలికితీసేందుకు వ్యాసరచన, డిబేట్ (వాదోపవాద), డ్రాయింగ్ పోటీలను కూడా ఏర్పాటు చేశామని, విద్యార్థినులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారనీ ఆమె తెలిపారు. మగ పిల్లల కోసం ఎర్రసమంతవలసలో వాలీబాల్, కబడ్డీ వంటి పోటీలను నిర్వహించామన్నారు. విజేతలందరికీ త్వరలో బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యులు సంధ్యారాణి, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సాలూరు: డ్రాయింగ్ పోటీలను పరిశీలిస్తున్న ఎటిడబ్ల్యుఒ

7200 లీటర్ల ఊట ధ్వంసం

ప్రజాశక్తి- సాలూరు

స్థానిక పోలీసులు, ఎక్సైజ్ శాఖ సంయుక్తంగా మండలంలోని దొర్లతాడివలస, సుల్లరి గ్రామాల్లో గురువారం దాడులు నిర్వహించి 7200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ జాయింట్ ఆపరేషన్‌లో, సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకుంటూ డ్రోన్ల సహాయంతో మారుమూల ప్రాంతాలపై నిఘా పెట్టారు. ఈ గ్రామాల్లో దట్టమైన అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ కేంద్రాలను గుర్తించి ధ్వంసం చేశారు. అక్రమ నాటుసారా తయారీని అరికట్టేందుకు ఈ తరహా దాడులు నిరంతరాయంగా కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో రూరల్ సిఐ పి. రామకృష్ణ, ఎక్సైజ్, ఎస్‌టిఎఫ్ అధికారులు, మక్కువ, సాలూరు రూరల్ ఎస్ఐలు, 45 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో జెసి పర్యటన

భద్రగిరి ఆసుపత్రి, ఆశ్రమ పాఠశాలలను పరిశీలించిన యశ్వంత్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రసూతి విభాగం ఏర్పాటు చేయాలని మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి వైద్య సిబ్బందికి సూచించారు. గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందుతున్న సేవలు పై ఆరా తీశారు. స్థానికంగా మెరుగైన వైద్య సేవలు అందేలా సిబ్బంది పనిచేయాలన్నారు. వైటిసిలో ఉన్న గర్భిణుల ప్రసూతి కేంద్రాన్ని భద్రగిరి ఆసుపత్రికి మార్చాలని సూచించారు. వైద్యశాలలకు నూతన డాక్టర్ల నియామకం ప్రభుత్వం చేపడుతుందన్నారు. కొత్తగా నిర్మించిన 50 పడకల ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. ఆసుపత్రికి వెళ్లి వచ్చేందుకు వీలుగా సిమెంటు రోడ్డు, కాలువలు నిర్మాణం చేపట్టాలని సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులకు సూచించారు. అనంతరం భద్రగిరి పిటిజి, గుమ్మలక్ష్మీపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో సమస్యలను పరిశీలించారు. మరుగుదొడ్లు, డార్మెటరీ పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పిటిజి పాఠశాలకు ఆరోప్లాంట్ ముంజూరైనట్లు చెప్పారు. విద్యార్థులకు అనారోగ్యం వస్తే వెంటనే స్పందించి వైద్యం చేయిస్తున్నారని అన్నారు. ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పిలు హాస్టల్స్‌ను సందర్శించి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్నారని జెసి తెలిపారు. ఎంపిడిఒ, తహశీల్దార్, ఎంఇఒ మండల అధికారులు అందరూ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలను ఎప్పటికప్పుడు సందర్శించాలని ఆదేశించినట్లు చెప్పారు. జిసిసి గోదాములను పరిశీలించి స్టాక్ నిల్వ, రికార్డులు పరిశీలించారు. ఈ పర్యటనలో భద్రగిరి ఐటిడిఎ డిఇ చాణిక్య, ఎఇ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జెసి

అభ్యసన స్థాయిని పెంచేలా విద్యా ప్రగతి

ప్రజాశక్తి- సీతంపేట

సీతంపేట ఐటిడిఎ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులలో కనీస అభ్యసన స్థాయిని మెరుగు పరిచే విధంగా విద్యా ప్రగతి ఉండాలని ఐటిడిఎ ప్రాజెక్ట్ ఆఫీసర్ పవార్ స్వప్న జగన్నాథ్ అన్నారు. విద్యాప్రగతి అనే నూతన కార్యక్రమాన్ని సీతంపేట బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆయన గురువారం ప్రారంభించారు ఈ సందర్భంగా మూడో తేదీన ఐటిడిఎ పాఠశాలలన్నింట్లో బేస్ లైన్ టెస్ట్ నిర్వహించామని తెలిపారు. విద్యార్థుల స్థాయిని ఎల్1, ఎల్2, ఎల్3, ఎల్4గా తెలుగు, ఇంగ్లీష్, హిందీ, లెక్కల విభాగంలో పరీక్ష నిర్వహించి విద్యార్థులను వర్గీకరించామనీ తెలిపారు. ఎల్1 నుంచి ఎల్ 4లోనికి తీసుకురావడానికి 50 రోజుల క్యాలెండర్ విడుదల చేసామని తెలిపారు. అక్షరాల నుంచి పదాలు పదాల నుండి వాక్యాలు వాక్యాల నుండి వ్యాసంగా చదవడానికి రాయడానికి విద్యార్థులను అభివృద్ధి పథంలో నడిపించడానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమర్థవంతమైన పాత్ర వహించి విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ జి.రామ్ మోహన్‌రావు, ప్రధానోపాధ్యాయులు వసంతలక్ష్మి, వసతి గృహ అధికారి పాలక అమల, సిఎంఒ చిరంజీవివులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రగతి నివేదికను అందిస్తున్న పిఒ

భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించాలి

ప్రజాశక్తి -సీతానగరం

భవన కార్మికులకు పనులు కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలని ఆ సంఘం మండల కార్యదర్శి తోలాపు రమేష్ అన్నారు. గురువారం సీతానగరంలో వారు మాట్లాడుతూ మండలంలో భవన నిర్మాణరంగంపై ఆధారపడుతూ తాపీ మేస్త్రి, కార్పెంటర్, ఎలక్ట్రిషన్, ప్లంబర్, రాడ్ బెండర్, పెయింటర్లతో పాటు హెల్పర్లు, మహిళా కార్మికులు సుమారు 600 మంది వరకు పనిచేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం కన్నా కొత్త ప్రభుత్వం మేలు చేస్తుందని ఎన్నో ఆశలతో కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేసి గెలిపిస్తే నేడు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. భవన కార్మికుల సంక్షేమానికి ఖర్చు పెట్టాల్సిన నిధులను ఇతర పథకాలకు దారి మళ్లిస్తున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు తగ్గుముఖం పట్టినందున గతంలో వ్యవసాయ కార్మికులుగా ఉన్న తాము ప్రత్యామ్నాయంగా భవన నిర్మాణ పనుల్లోకి వచ్చామని తెలిపారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న విధానాల వల్ల పూర్తిగా పనులు కోల్పోతున్నామని, వలసలు పోదామంటే అక్కడ కూడా పోటీ ఎక్కువగా ఉందని, ఉన్న ఊరిలో బతకలేక భార్య, పిల్లల్ని, పస్తులతో ఉంచలేక సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల సంక్షేమ నిధి నుంచి కొంత నిధిని నిరుద్యోగ భృతి కింద నమోదైన ప్రతి కార్మికుడికి చెల్లించాలని, లేనిచో భవిష్యత్తులో యావత్ కార్మిక వర్గాన్ని సంఘటితపర్చి ఆందోళన, పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు శనపతి కృష్ణ, నాయకులు రాయిపల్లి రాము, రంకిరెడ్డి శంకర్రావులు పాల్గొన్నారు.

డోలీ మోతలు ఉన్న రోడ్లను గుర్తించాలి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో డోలి మోతలు ఉన్న గ్రామాలకు సంబంధించిన రోడ్లను గుర్తించాలని పంచాయతీరాజ్ ఈఈ జి. రవి సిబ్బందికి సూచించారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మండల అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే 14 రోడ్లు మంజూరయ్యాయని ఇంకా గ్రామాల్లో ఎక్కడైతే డోలిమోతలతో ఉన్నాయో అటువంటి రోడ్లను సమగ్ర సర్వే చేపట్టి గుర్తించి నివేదిక అందిస్తే ఉన్నతాధికారులకు పంపించి రోడ్లు మంజూరయ్యేలా చర్యలు చేపడతామని అన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ జె. ఉమామహేశ్వరి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

త్వరతగతిన గృహ నిర్మాణాలు చేపట్టాలి

త్వరతగతిన గృహ నిర్మాణాలు చేపట్టేలా మండల అధికారులు చర్యలు తీసుకోవాలని పిఆర్ ఈఈ, హౌసింగ్ ఈఈ జి.రవి అన్నారు. గురువారం మండలంలో వబ్బంగి, నీలకంఠాపురం, పెద్ద గొత్తిలి పంచాయతీల్లో గల పలు గ్రామాల్లో పీఎం జన్మమన్ పథకం కింద నిర్మిస్తున్న ఇళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకునేలా లబ్ధిదారులు కృషి చేయాలని, బిల్లు కూడా త్వరతగతిన ప్రభుత్వం విడుదల చేస్తుందని చెప్పారు. ఇంకా ఎవరికైనా బిల్లులు పడకపోతే హౌసింగ్ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఈఈ రవి

ఓర్పుతోనే విద్యార్థులకు నేర్పు : ఆర్‌జెడి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఉపాధ్యాయులు ఓర్పుతో విద్యార్థులకు నేర్పితే మంచి ఫలితాలు అందుకోగలరని ఆర్‌జెడి విజయభాస్కర్ సూచించారు. కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి వినతి మేరకు గుమ్మలక్ష్మీపురం మండలంలోని దుమ్మంగి, బొద్దిడి, పి. ఆమిటి ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వ పాఠశాలలుగా మార్చిన నేపథ్యంలో వాటి పనితీరుపై ఏజెన్సీలో ఆయన గురువారం సందర్శించారు. ఈ పర్యటన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు ఎంత ఓర్పుగా పాఠ్యాంశాలు చెబితే విద్యార్థులు అంత నేర్చుకోవడానికి ఆసక్తి చూపుతారన్నారు. ప్రతి పాఠశాలలో ఈ విధానం అవలంబిస్తే నూరు శాతం ఫలితాలు సాధించవచ్చన్నారు. ఈ రకమైన బోధన లేకపోవడంతో ఏజెన్సీలో విద్యార్థులు ఇంకా వెనుకబడి ఉన్నారని అన్నారు. ఎయిడెడ్ పాఠశాలలు సందర్శన సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు పాఠ్యాంశాలపై పట్టు, చదువు పట్ల ఆసక్తి, ఏ మేరకు నేర్చుకున్నారు, ఉపాధ్యాయుల బోధన విధానం వంటి అంశాలను పరిశీలించారు. విద్యార్థులు డ్రాపోర్ట్స్ లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందన్నారు. చదువు పట్ల విద్యార్థులు భయాన్ని పోగొట్టేందుకు ఆటపాటలతో విద్యా బోధన చేయాలన్నారు. ఈ పర్యటనలో ఎంఇఒలు చంద్రశేఖర్, బిడ్డిక బీముడు, ఉపాధ్యాయులు అడ్డాకుల గుండునాయుడు, ఎస్టీ కమిషన్ సభ్యులు కద్రక మల్లేశ్వరరావు, ఎస్టీ సెల్ అధ్యక్షులు మండంగి భూషణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

పాఠశాలను పరిశీలిస్తున్న ఆర్‌జెడి విజయభాస్కర్

అక్రమంగా తరలిపోతున్న మట్టి

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ఇరిగేషన్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న సోమసాగరం చెరువు నుంచి పెద్ద ఎత్తున మట్టిని అక్రమంగా తరలిస్తుడడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెరువులను రక్షించాల్సిన ఇరిగేషన్ అధికారుల కళ్ల ముందే జెసిబి యంత్రాలతో చెరువులో మట్టి తవ్వకాలు సాగుతుండటం ఆశ్చర్యం కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు సమాచారం మేరకు, గత కొన్ని రోజులుగా పగలు, రాత్రి తేడాలేకుండా ట్రాక్టర్లతో చెరువులోని మట్టి తీసుకెళ్తున్నారు. ఈ మట్టిని సమీపంలోని ప్రైవేట్ లేఅవుట్లు, కట్టడాలు, కాంట్రాక్ట్ పనుల కోసం వినియోగిస్తున్నారని సమాచారం. పలుమార్లు ఇరిగేషన్ అధికారులకు, తహశీల్దార్, పంచాయతీ కార్యాలయానికి ఫిర్యాదులు చేసినా చర్యలు కనిపించలేదని ఆరోపిస్తున్నారు. చెరువు తవ్వకాల వల్ల నీటి నిల్వ సామర్థ్యం తగ్గి వర్షాలు పడ్డా నీరు నిల్వ ఉండడం లేదని, భవిష్యత్తులో నీటి కొరత తప్పదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకొని చెరువును రక్షించాలని, అక్రమ తవ్వకాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మట్టిన జెసిబితో తవ్వి ట్రాక్టర్‌కు ఎత్తుతున్న అక్రమార్కులు

గురుకుల పాఠశాల సందర్శన

కురుపాం: మండల కేంద్రంలోని గురుకుల బాలికల పాఠశాలను ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న వాకింగ్ ట్రాక్, గ్రౌండ్ సమతుల్య పనులను పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపాల్ విజయలక్ష్మితో మాట్లాడి జరుగుతున్న పనులు విద్యార్థుల ఆరోగ్యం గూర్చి తెలుసుకొని ముస్తాబు కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి విద్యార్థులు ఆరోగ్యం, విద్యపై తీసుకోవలసిన జాగ్రత్తలపై పలు సూచనలు సలహాలు అందించారు.

గ్రామ సమస్యలపై టిడిపి వినతి

ప్రజాశక్తి- బలిజిపేట

అన్ని గ్రామాల సమస్యలపై తక్షణమే అధికారులు స్పందించాలని టిడిపి మండల అధ్యక్షులు పెంకి వేణుగోపాల్ నాయుడు కోరారు. గురువారం ఆయన టిడిపి నాయకులతో కలిసి పలు గ్రామాల్లో ఉన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్, ఎంపిడిఒలకు వినతి పత్రాన్ని అందించారు. తహశీల్దార్ కార్యాలయంలో హెచ్‌డిటిని కలిసి రెవెన్యూకు సంబంధించిన సమస్యలు, భూ వివాదాలు, పౌర సేవల్లో జాప్యం వంటి అంశాలపై వివరించారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒని కలిసి గ్రామీణాభివృద్ధి, పారిశుధ్యం, మౌలిక సదుపాయాలు కొరత, ప్రభుత్వం నుండి మంజూరు కావాల్సిన నిధులపై చర్చించారు. ఉపాధి హామీ, వ్యవసాయశాఖ ఎఒను కలిసి రైతులు, ఉపాధి కూలీలు పడుతున్న సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పెంకి వేణుగోపాల్ నాయుడు మాట్లాడుతూ మండలంలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, అధికారులు ప్రజల పట్ల సానుకూలంగా స్పందించి, తక్షణమే ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేస్తున్న టిడిపి నాయకులు

సంతలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రమైన కురుపాంలో గురువారం జరిగిన వారపు సంతలో రావాడ రామభద్రపురం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సుకృత ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. సంతకు వచ్చిన గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేసి వ్యాధుల బారిన పడకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్య శిబిరాన్ని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలు గూర్చి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దశమంతపురంలో వైద్య శిబిరం

వీరఘట్టం: మండలంలోని దశమంతపురంలో గురువారం స్థానిక వైద్యాధికారి యం.సాయికుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణులు, మధుమేహ, రక్తపోటు, చిన్నారులకు, ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైల్లో పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి - కొమరాడ

ఒడిస్సా నుంచి ఆంధ్రాలోకి ఎటువంటి మత్తు పదార్థాలు అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ కె.నీలకంఠం అన్నారు. గురువారం రాయగడ నుంచి విజయనగరం వెళ్లే కుర్దా రైలులో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు, జిఆర్‌పి పోలీసులు ఆర్‌పిఎఫ్, ఎస్‌టిఎఫ్, ఈగల్ టీం బృందాలతో రైలులో ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. ఒడిశా నుంచి గంజాయి మత్తు పదార్థాలు రవాణా జరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేయమని తెలిపారు. ట్రెన్‌లో ప్రయాణికుల బ్యాగులను డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. అనుమానత బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే విడిచిపెట్టినట్టు తెలిపారు. ఇటీవల కాలంలో గుట్టుగా ప్రైవేట్ వాహనాల్లో కాకుండా ట్రెన్లో అక్రమ రవాణా జరుగుతున్న నేపథ్యంలో నిఘా కట్టుదిట్టం చేశామని తెలిపారు. కూనేరు నుంచి విశాఖ వరకు ప్రయాణించిన ట్రెన్‌లో అన్ని భోగీలను క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. ఈ తనిఖీల్లో జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్ఎస్, ఈగల్ టీం బృందాల పోలీసులు ఉన్నారు.

రైల్వో తనిఖీ చేస్తున్న డాగ్ స్క్వాడ్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట పోలీస్ చెక్ పోస్ట్ వద్ద ఎస్ఐ బిడ్డిక శివప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, ఒడిశా ప్రాంతాలకు రాకపోకలు సాగించే మోటారు సైకిళ్లు, ఆటోలు, వ్యాన్‌లు తదితర వాహనాలను తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరికీ లైసెన్స్ ఉండాలని, వాహనాలకు అన్ని అనుమతి పత్రాలూ ఉండాలని సూచించారు.

సీతంపేట: స్థానిక అడ్వెంచర్ పార్క్ వద్ద సీతంపేట ఎస్క్మై.అమ్మనరావు గురువారం వాహనాలు తనిఖీ చేపట్టారు. క్షుణంగా వాహనాలకు సంబంధించిన ధ్రువ పత్రాలను పరిశీలించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మితిమీరిన వేగం పనికిరాదని ప్రయాణికులకు యువతకు ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సంజీవ్ ఉన్నారు.

మహారాజశ్రీ సాలూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 165/2023

అల్లు ప్రభాకర్ ......వాది
అండ్
బత్తుల సరస్వతి వగైరాలు ....ప్రతివాదులు
ఓన సీతా మహాలక్ష్మి భర్త మధు, (2వ ప్రతివాది) 27 సం॥లు, నడుపూరు గ్రామం, పాలకొండ మండలం, (రూరల్) పార్వతీపురం మన్యం జిల్లా.

నెంబరుకేసులో ఇందలి వాది గారు 2వ ప్రతివాదిపై పై కోర్టులో కేసును దాఖలు చేసి యున్నారు. పై నెంబరు కేసులోని ఇందలి 2వ ప్రతివాదికి తే 25-11-2025 దీన పై కోర్టులో వాయిదా అయి యున్నది. పై నెంబరు కేసులో 2వ ప్రతివాది అయిన మీరు **తే 25-11-2025 దీన ఉదయం 10-30 గం॥లకు** మీరు గాని, మీ వలన ఆర్డరు పొందిన వారు గానీ, మీ తరుపున వకీలు గారు గానీ, పై కోర్టులో హాజరు అయి మీ తరుపున వాదన దాఖలు చేసుకొనవలెను. లేనిచో పై కేసు మీ పరోక్షమున తీర్మాణం జరుగునని ఇందు మూలముగా తెలియ జేయడమైనది.

వాయిదా 25-11-2025 ది.

(వాది తరుపు న్యాయవాది)
గంట అప్పలనాయుడు
న్యాయవాది,
సాలూరు మునిసిపాలిటీ,
పార్వతీపురం మన్యం జిల్లా 535591.

సాలూరు
06-11-2025